క్లుప్తంగా

ఎన్‌సీసీలో కేడెట్ ప్రతిభ


అవార్డు అందుకుంటున్న హరికృష్ణ

అశ్వాపురం: 11 తెలంగాణ బెటాలియన్ ఖమ్మం ఎన్‌సీసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎన్‌సీసీ కార్యక్రమంలో మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కళాశాల బీజెడ్సీ విద్యార్థి హరికృష్ణ ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్నాడు. జూనియర్ అండర్ ఆఫీసర్ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా హరికృష్ణను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

గిరిజన న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం కేంద్రంగా ఏజెన్సీ గిరిజన న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లుకు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. భద్రాచలం గిరిజన భవన్‌లో జరిగిన గిరిజన హస్తకళ ఉత్పత్తుల మేళా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలను కలిసి కళాశాల మంజూరుకు సీఎం దృష్టికి తీసుకెళ్లి గిరిజన న్యాయ, డిగ్రీ, టీటీసీ బీఈడీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. పరిషత్ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సోందె వీరయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అర్హులైన ప్రతీ పేదవాడికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దళిత ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు అల్లాడి జయరాజు అన్నారు. పట్టణంలోని కొర్రాజులగుట్ట కాలనీలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిరాజు, డేగల రాజు, రామకృష్ణ, హరీష్, శ్యామ్, యేసు, కొండ, శేఖర్ పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

అశ్వాపురం: ఐటీసీ బంధన్ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శుక్రవారం ఒంటరి మహిళలకు ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీటీసీ కమటం నరేష్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఏసీ ఉత్తమ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వేణు, చినబాబు, అగ్రికల్చర్ ఏఈఓ లక్ష్మణ్, పోస్టల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

209 మంది రైతులకు లబ్ధి

మణుగూరు టౌన్: మణుగూరు మండల సొసైటీకి చెందిన 209 మంది రైతులకు రూ.73.45లక్షల రుణమాఫీ జరిగిందని మణుగూరు డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరికొద్ది రోజుల్లో మిగతావారికి కూడా రుణమాఫీ వర్తిస్తుందని ఆయన తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

ములకలపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక వైద్య ఖర్చులకు రూ.1.10 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కొమ్ముగూడెంకు చెందిన కారం వెంకటేశ్ కూతురు విద్యా శరణ్యకు నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ చేయి చచ్చుబడగా చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చొరవతో సీఎంఆర్‌ఎఫ్‌లో డబ్బులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ మండల కార్యాలయంలో పార్టీ నాయకులు సదరు కుటుంబానికి అందజేశారు. మండలాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, నాయకులు అంజి, సుధీర్, రవి, వేముల రోశయ్య, ఉమామహేశ్వరరావు, నల్లి రాము, రాజ్‌కుమార్, సంపత్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు పరిహారం చెల్లించాలి

మణుగూరు టౌన్: రామగుండం ఓసీపీ–2 ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు సింగరేణి కార్మికుల కుటుంబాలకు అర్హత కలిగిన వారికి తక్షణమే ఉద్యోగం, రూ.కోటి నష్టపరిహారం ప్రకటించాలని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. యాజమాన్యం తెస్తున్న ఒత్తిడి, షిఫ్ట్ మార్పుల వల్లనే కార్మికులు మానసిక ఆవేదనకు గురి అవుతూ ప్రమాదాలు నెలకొంటున్నాయన్నారు. గట్టయ్య యాదవ్, రాములు, వెంకటేశ్వర్లు, సంతోష్, చరణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మణుగూరు టౌన్: మణుగూరు పట్టణం పైలెట్ కాలనీ సివిల్ ఆఫీస్ వద్ద కనకదుర్గ ఆలయంలో అమ్మవారు శుక్రవారం సారె అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా 50 రకాలకు పైగా వంటకాలను అమ్మవారికి ప్రసాదంగా ఉంచారు. ఆలయ పూజారి సంతోష్‌శర్మ మాట్లాడుతూ... ప్రజల మేలును కాంక్షిస్తూ అమ్మవారు సారె అలంకరణ దర్శనమిచ్చినట్లు తెలిపారు.

ఎడతెరిపి లేకుండా..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షం
- పొంగి పొర్లుతున్న వాగులు, చెరువులు
- తీవ్రంగా పంటనష్టం
- రోడ్లు ధ్వంసంతో రాకపోకలకు ఇక్కట్లు
- స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం


దుమ్ముగూడెం: పర్ణశాల వద్ద పెరుగుతున్న గోదావరి

రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తునే ఉంది. వరద నీటితో వాగులు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. ఈ మేరకు పత్తి చేలల్లో నీరు నిలవడం, వరిపొలాల్లో వరదతో నారు కొట్టకపోయి ఇసుకమేటలు వేయడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రోడ్లు ధ్వంసం, కోతకు గురైయ్యి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. – సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: కన్నాయిగూడెం-కావడిగుండ్ల మార్గంలో భారీగా పడిన గండి


దుమ్ముగూడెం: నీటమునిగిన నార చీరల ప్రాంతం


గుమ్మడవల్లి-రంగాపురం హైలెవల్ వంతెనకు పడిన గండి


అశ్వారావుపేటరూరల్: అనంతారం వద్ద వరద ప్రవాహంతో కోతకు గురైన బీటీ రోడ్డు


వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన గొర్రెలు


అశ్వారావుపేటరూరల్: గాండ్లగూడెం వాగు వద్ద విరిగి పడిన కరెంట్ స్తంభాలు


పెదవాగు ఉధృతికి దెబ్బతిన్న వరి పొలం


విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపిస్తున్న ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది


అశ్వారావుపేటరూరల్: ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ, ఏడీఏ అఫ్జల్ బేగం

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

- ఎమ్మెల్యే ఆదినారాయణ


పగలగొట్టిన గోడను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: వరద ప్రభావిత ప్రాంతాల వారికి వెంటనే సహాయక చర్యలు అందజేసి, అవసరమైన చోట మరమ్మతులు తక్షణమే నిర్వహించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సంబంధిత అధికారులకు సూచించారు. మండల పరిధిలో వరద ప్రభావానికి గురైన ప్రాంతాలను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని మందలపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్ పక్కనే గల కాలనీలో వరద నీరు ఇళ్లలోకి చేరుకోగా, కాలనీ వాసులు వరద నీరు పోయే మార్గం లేక, ఆర్టీసీ ప్రహరీని కొంతమేరకు పగలగొట్టారు. వరద నీరు చేరుకున్న బస్‌స్టేషన్ ప్రాంగణాన్ని, మందలపల్లి కాలనీను ఎమ్మెల్యే జారే పరిశీలించారు. అదే గ్రామంలో కోతకు గురైన రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌పామ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు అలపాటి రామచంద్ర ప్రసాద్, నాయకులు పర్వతనేని ప్రసాద్, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

కోతకు గురైన డైవర్షన్ రోడ్డు


కోతకు గురైన డైవర్షన్ రోడ్డు

ములకలపల్లి: ములకలపల్లి–తాళ్లపాయ నడుమ పాములేరు వాగుపై ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డుకు మళ్లీ కోతకు గురైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు తెగిపోగా, ప్రత్యామ్యాయంగా నిర్మించిన ఇనుప వంతెన మీద నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వాగుపై నూతన వంతెన నిర్మించేందుకు శిథిలావస్థకు చేరిన మినీ బ్రిడ్జిని కూల్చివేశారు. తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు నిర్మించి, వంతెన నిర్మాణ పనులు చేస్తున్నారు. భారీ వర్షాలకు డైవర్షన్ రోడ్డు తెగిపోవడంతో, రహదారి సౌకర్యం లేకుండాపోయింది. దీంతో మూడు రోజులు శ్రమించి, మళ్లీ డైవర్షన్ వేశారు. వాగు ఉధృతికి డైవర్షన్ రోడ్డు దెబ్బతినే ప్రమాదముందని ప్రత్యామ్యాయంగా రూ.13 లక్షల వ్యయంతో ఇనుప వంతెన నిర్మించారు. శుక్రవారం రోడ్డు తెగిపోవడంతో ఇనుప వంతెన గుండా రాకపోకలు సాగిస్తున్నారు.

పాలవాగుపై మొదలైన రాకపోకలు


పోలీసుల పర్యవేక్షణలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

ములకలపల్లి : ముత్యాలంపాడు శివారు పాల వాగుపై రాకపోకలు మొదలయ్యాయి. వాగుపై నూతనంగా బ్రిడ్జి నిర్మిస్తుండగా, లోలెవల్ చప్టాను కూల్చివేసి, వేసిన డైవర్షన్ రోడ్డు తెగిపోగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కోతకు గురైన డైవర్షన్ వద్ద సీసీ (సిమెంట్, కాంక్రీట్) రోడ్డు నిర్మించారు. శుక్రవారం ప్రవాహ ఉధృతి తగ్గడంతో పోలీసుల పర్యవేక్షణలో రాకపోకలు నియంత్రించి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. సాయంత్రానికి సీసీ పూర్తి చేసి, రోడ్డు సౌకర్యం కల్పించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక: మణుగూరు మండల కేంద్రంలోని ప్రజాభవనంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. మండలపరిధిలోని వివిధ పంచాయతీలకు చెందిన తొమ్మిది మందికి చెక్కులను పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో ఆగిన చెక్కులను ముఖ్యమంత్రి గారితో మాట్లాడి మరలా చెప్పులు తీసుకొచ్చామన్నారు. నాయకులు పేరం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే ప్రాజెక్టు ధ్వంసం


కోతకు గురైన కట్టను పరిశీలిస్తున్న నాయకులు

అశ్వారావుపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన గుమ్మడవల్లి ప్రాజెక్టు ధ్వంసం కావడానికి ఇరు రాష్ట్రాల పాలకుల నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుమ్మడవల్లి ప్రాజెక్టును సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్యలతో కలిసి ఆయన సందర్శించారు. వరదకు కొట్టుకుపోయిన ప్రాజెక్టు కట్ట ప్రాంతాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన ఈప్రాజెక్టును రాష్ట్ర విభజన తర్వాత అయకట్టు ఒక రాష్ట్రంలో ప్రాజెక్టు మరో రాష్ట్రంలో ఉందని ఇరు రాష్ట్రాలు మరమ్మతులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించాయని, ఆకారణంగా ప్రాజెక్టు ధ్వంసం అయిందన్నారు. ఇకనైనా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అధికారులు చర్చించుకుని ప్రాజెక్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, డీఫైర్ కమిటీలను రద్దుచేయలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు జీఎస్. నారాయణ, కె.భాస్కర్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎంప్లాయిస్ యూనియన్ భద్రాచలం డిపో నిర్మాణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థలో గత ప్రభుత్వ విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తుందని, కార్మికులకు రావాల్సిన బాండ్ల నగదును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపో యూనియన్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్.విజయకుమార్, రమణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్, చీఫ్ అడ్వైజర్‌గా ఎంవి.వెంకన్న, కోశాధికారిగా ఎస్‌కె.ముగుద్దం, సహాయ కార్యదర్శులుగా రాంబాబు, కుమార్, వాసు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుధాకర్, గ్యారేజీ కార్యదర్శిగా ఈశ్వర్‌తో పాటు కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, మాచర్ల సుందరం తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట పంచాయతీ టీడీ బంజర్‌లోగల ఓ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.1,500 విలువగల నిషేధిత గుట్కా ప్యాకెట్లను శుక్రవారం స్థానిక ఏఎస్సై సర్దార్ దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకుషాప్ యజమానిపై ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి


చంద్రుగొండ: మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది


చర్ల రూరల్: కుదునూరులో..

చంద్రుగొండ : వర్షాలు పడుతున్న క్రమంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ కనకం తనుజ సూచించారు. మండలకేంద్రం చంద్రుగొండలోని అంబేడ్కర్‌నగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎండీ.ఇమాం, సిబ్బంది సుమతి, భవాని, ఆశవర్కర్లు కుమారి, పుణ్యవతి, ప్రవళిక, అరుణ, సుజాత, సరోజిని, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

చర్ల రూరల్: మండలంలోని కుదునూరు, గొమ్ముగూడెం తదితర గ్రామాలలో సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వైద్యశిబిరం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వరద ప్రభావిత గ్రామమైన గుమ్మడవల్లిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎహెచ్‌సీ వైద్యాధికారి కే.వెంకి ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్‌వీ దుర్గమ్మ, సిబ్బంది భాస్కర్‌రావు, ఏఎన్ఎం రేవతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రభుత్వ వైద్యురాలు ప్రియాంక గ్రామస్తులకు సూచించారు. మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో.. పెంట్లం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు.

వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


బూర్గంపాడు: సూచనలు చేస్తున్న సీఐ, ఎస్సై


దుమ్ముగూడెం : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్


మణుగూరు టౌన్: గోదావరి పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బూర్గంపాడు: భారీ వర్షాలతో గోదావరి, కిన్నెరసాని నదులకు వరద ఉధృతి పెరుగుతున్నందున వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు సూచించారు. బూర్గంపాడుకు సమీపంలోని గోదావరి, కిన్నెరసాని సంగమ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బూర్గంపాడులోని కొల్లుచెరువు వద్ద ఉన్న వరద ముంపు ప్రాంతాలలో పర్యటించారు. ఎలాంటి ఇబ్బందులున్న ప్రజలు పోలీస్, రెవెన్యూ అధికారులకు వెంటనే సమాచారమివ్వాలన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో కూడా ప్రత్యేక సమాచార కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

గోదావరి, కిన్నెరసాని వరదల నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని పాల్వంచ సీఐ వినయ్, బూర్గంపాడు ఎస్సై రాజేష్‌లు సూచించారు. బూర్గంపాడులోని అంబేడ్కర్‌కాలనీ, కొల్లుచెరువు ప్రాంతాల్లో శుక్రవారం వరదలపై ప్రజలు అవగాహన కల్పించారు. వరద ఉధృతి పెరిగి నీరు చేరేటప్పుడు ముంపు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

దుమ్ముగూడెం : మండలంలోని సున్నంబట్టి గ్రామాన్ని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. గోదావరి వరద పెరిగే క్రమంలో చేపల వేటకు వెళ్లోద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాలిపేరు ఈఈ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు వరద ప్రవాహం అధికంగా ఉన్న వాగులు చెరువులను మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు ప్రాంతాలైన చినరావిగూడెం, అన్నారం, కమలాపురం, కొండాయిగూడెం గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి రెండు రోజులుగా వస్తున్న వర్షం వల్ల వరద ప్రభావాన్ని అడిగి తెలుసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటికి రావాలి

మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు రూరల్ : రాగల రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో మణుగూరు సబ్ డివిజన్ ప్రజలు అత్యవసరమైతేనే బయటికి రావాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సూచించారు. సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... వరదలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలెవ్వరూ కూడా కరెంట్ స్తంభాలను, తడిచిన గోడలను పట్టుకోవడం చేయకూడదని, పిల్లలను బయటికి పంపించవద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అప్రమత్తత తప్పనిసరి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: మరో రెండు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షాలతో పాటు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ఇచ్చిన నేపథ్యంలో పినపాక నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని సూచించారు. పశువుల కాపరులు పంట పొలాలకు వెళ్లే వారు వాగులు, వంకలు దాటొద్దన్నారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గోవును కాపాడి..


ఆవును రక్షిస్తున్న ఫైర్ సిబ్బంది

మణుగూరు టౌన్: పట్టణంలోని ప్రధాన కాల్వ కట్టువాగులో ప్రమాదవశాత్తు పడిన గోవును శుక్రవారం కాపాడారు. సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న బీజేపీ పట్టణాధ్యక్షుడు లింగంపల్లి రమేశ్ ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల సాయంతో గోవును కట్టువాగు నుంచి తాళ్ల సాయంతో తీసి కాపాడి మానవత్వం చాటుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పినపాక: ఈ బయ్యారం సబ్ స్టేషన్‌లో 33/11కేవీ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని జానంపేట, బయ్యారం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యాశాఖ ఏఈ కావ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి ఆస్పత్రి కార్మికుల సమ్మె

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, సిబ్బంది ఆదివారం నుంచి సమ్మె చేయనున్నట్టు శుక్రవారం సీఐటీయూ నాయకులు ఎంబి.నర్సారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏరియా ఆస్పత్రిలో కార్మికులతో ఏర్పాటుచేసి జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సూపరింటెండెంట్ డా.రామకృష్ణకు విన్నవిస్తే ఈనెల 19లోపు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ పరిష్కారం కాలేదని శనివారం వరకు ఒక్క అవకాశమిచ్చి, ఆదివారం నుంచి సమ్మె చేస్తామన్నారు. స్వామి, రమాదేవి,కృష్ణ, నరసింహారావు, గీత, మమత, రమణమ్మ, రమేష్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రతీ అడుగు రైతుల సంక్షేమానికే..

కరకగూడెం: కాంగ్రెస్ పార్టీ ప్రతీ అడుగు రైతుల సంక్షేమం కోసమేనని పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా రైతులతో కలిసి బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబురాలు నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఏజెంట్ల హక్కుల కోసం పోరాటం


మాట్లాడుతున్న మార్కండేయులు

భద్రాచలంటౌన్: జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ ఏజెంట్ల హక్కుల కోసం లియాఫి 2924/2000 యూనియన్ నిరంతర పోరాటం చేస్తుందని, యూనియన్ ఆల్ ఇండియా సెక్రెటరీ జనరల్ మార్కండేయులు అన్నారు. స్థానిక జీయర్ మఠంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వరంగల్ డివిజన్ కమిటీ ప్రథమ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవిత బీమా ఏజెంట్లకు హెల్త్ కార్డు, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాడ్యూటీ లిమిట్లను పెంచడంతో పాటు పాలసీదారులకు బోనస్ పెంచిన్నప్పుడే జీవిత బీమా వ్యాపారం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. లియాఫి ఆల్ ఇండియా ఈసీ మెంబర్ గట్టు వెంకటాచారి, డివిజన్ ప్రెసిడెంట్ రామారావు, సెక్రటరీ నారాయణ, ఆల్ ఇండియా ఈసీ మెంబర్ వీరభద్ర రావు, గోలి శ్రీనివాసరెడ్డి, వాసిరెడ్డి రాజేంద్రప్రసాద్ వరంగల్ డివిజన్లోని 13 బ్రాంచ్‌లకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.